క్లుప్తంగా

హనుమద్ శోభాయాత్ర

జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూడెంలో వీహెచ్‌పీ ఆధ్వర్యంలో శోభాయాత్ర ఆదివారం నిర్వహించారు. హనుమద్ జయంతి సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమం మద్ది ఆంజనేయ స్వామి ఆలయం నుంచి మోటార్ సైకిళ్ల ర్యాలీగా ప్రారంభమై జంగారెడ్డిగూడెం పట్టణంలో బస్టాండ్ సెంటర్, మసీదు సెంటర్, జెడ్పీ హైస్కూల్, శ్రీనివాసపురం రోడ్, పొట్టిశ్రీరాముల సెంటర్, గంగానమ్మగుడి సెంటర్, పాత బస్టాండ్, కొత్తపేట అభయాంజనేయస్వామి ఆలయం వరకు సాగింది. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

శ్రీవారి గోవులకు వైద్య పరీక్షలు



శ్రీవారి గోసంరక్షణశాలలో ఆవుకు చూడి పరీక్ష చేస్తున్న వైద్యుడు సురేష్

ద్వారకాతిరుమల : శ్రీవారి కొండపైన గోసంరక్షణ శాలలోని గోవులకు మండల పశువైద్యాధికారి అంగర సురేష్ ఆదివారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆలయ ఏఈఓ మెట్టపల్లి దుర్గారావు పర్యవేక్షణలో దాదాపు 40 ఆవులను పరీక్షించారు. అందులో 10 ఆవులు చూడి కట్టినట్టు నిర్ధారించారు. అలాగే మిగిలిన ఆవులు చూడికట్టడానికి చికిత్స అందించారు. ఈ సందర్భంగా గోశాలలోని సిబ్బందికి వైద్యుడు సురేష్ ఆవుల ఆరోగ్యం విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు, సలహాలనిచ్చారు.


పదో తరగతి విద్యార్థులకు సన్మానం



ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సత్కరిస్తున్న దృశ్యం

చింతలపూడి : మండలంలో పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఆదివారం మానవత ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. స్థానిక విద్యా వనరుల కేంద్రంలో విద్యార్థులను ఎంపీపీ బి.రాంబాబు నాయక్, నగర పంచాయతీ కమిషనర్ ఎస్.రాంబాబు, సీఐ ఎంవీఎస్ మల్లేశ్వరరావు, మానవత డైరెక్టర్ డా ఎ.సత్యన్నారాయణ, చైర్మన్ ఎ.అప్పారావు శాలువాలు కప్పి ఒకొక్కరికి రూ.2 వేల నగదు, మొమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో మానవత వైస్ చైర్మన్ ఎం.శామ్యూల్, అధ్యక్షుడు కె నాగ చిన్నారావు, కార్యదర్శి ఎ.రాజారావు, సహాయ కార్యదర్శి బీవీఎస్ రాజు, కోశాధికారి విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దొరమామిడిలో ముగిసిన జాతర



పూజలందుకున్న ముత్యాలమ్మ తల్లి

బుట్టాయగూడెం : దొరమామిడిలో గత 14 రోజుల పాటు జరిగిన గంగానమ్మ, ముత్యాలమ్మ, పుంతలో ముసలమ్మ, పోతురాజుల జాతర మహోత్సవాలు ఆదివారం సాయంత్రంతో ముగిశాయి. చివరిరోజు భక్తుల రాకతో దొరమామిడి గ్రామం కిటకిటలాడింది. ప్రతి ఇంటా పూజా కార్యక్రమంతో పాటు భోజన కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ముత్యాలమ్మ తల్లి, గంగానమ్మ, పుంతలో ముసలమ్మ తల్లి, పోతురాజులను దర్శించుకుని భక్తులు పూజలు చేశారు. భక్తులకు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా జీలుగుమిల్లి సీఐ బి.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఎస్సై ఎం.జయబాబు, 80 మంది పోలీసులు, 10 మంది స్పెషల్ ఫోర్స్ పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

నేడు డివిజన్ స్థాయి స్పందన

లింగపాలెం : లింగపాలెంలో డివిజన్ స్థాయి స్పందన కార్యక్రమం సోమవారం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ మురళీకృష్ణ తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నూజివీడు సబ్ కలెక్టర్ ఆధ్వర్యంలో లింగపాలెం తహసీల్దార్ కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ తెలిపారు. ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమానికి డివిజన్, మండల స్థాయి అధికారులు హాజరు కావాలన్నారు.

నేటినుంచి ఇంటర్ ప్రవేశాలు

ఉంగుటూరు: ప్రభుత్వ కళాశాలలో ఇంటర్ ప్రవేశాలకు సోమవారం నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు నారాయణపురం మహాత్మా గాంధీ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బి. శ్రీనివాసులు తెలిపారు. జూన్ 14 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ గ్రూపులకు ఇంగ్లిష్, తెలుగు మీడియంలో బోధన అందుబాటులో ఉందని, వివరాలకు సెల్ 94416 87844 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

పవన తనయ.. సంకట హరణ

పోలవరం రూరల్ : హనుమద్ జయంతి పురస్కరించుకుని రెడ్డికుంకాల గ్రామ సమీపంలో అటవీ ప్రాంతంలో కొలువైన శ్రీశ్రీ అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద హనుమద్ మహాయజ్ఞం నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి స్వామి వారికి పంచామృతాలు, తమలపాకులు, సింధూరంతో పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం హోమం, మండపారాధన, పూర్ణాహుతి కార్యక్రమాలను వేదపండితులు ర్యాలీ శేఖర్ ఆధ్వర్యంలో జరిపారు. ఎమ్మెల్యే తెల్లం బాలరాజు హాజరై స్వామివారిని దర్శించుకుని పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అధిక సంఖ్యలో భక్తులు ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు. జెడ్పీటీసీ కలుం హేమకుమారి, మండల ఉపాధ్యక్షుడు మిడియం సింగరాజు, సర్పంచ్ కోటం గంగాదేవి, కోటం బాబూరావు, పోలవరం ఎస్సై ఎస్ఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బుట్టాయగూడెం : ఏజెన్సీ ప్రాంతంలో హనుమాన్ జయంతి వేడులు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. బుట్టాయగూడెం అభయాంజనేయ స్వామి ఆలయంలో ఉదయం 6 గంటల నుంచి ఏకాహం ఏర్పాటు చేశారు. రెడ్డిగణపవరంలో మహిళలు హనుమాన్ చాలీసా 108 సార్లు పారాయణం చేశారు. స్వామి వారికి క్షీరాభిషేకం చేసి వివిధ రకాల పుష్పాలతో అభయాంజనేయ స్వామిని అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు. భక్తులకు 5 రకాల ప్రసాదాలు, మజ్జిగ, మంచి నీళ్ల వితరణ చేశారు. బుట్టాయగూడెంలో హనుమాన్ భక్తులు కొండేపాటి రామకృష్ణ ఆధ్వర్యంలో ద్విచక్రవాహనాలతో ర్యాలీ చేశారు. జై హనుమాన్... జై శ్రీరామ్ అంటూ నినాదాలు చేశారు.



రెడ్డికుంకాల ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బాలరాజు



ద్వారకాతిరుమలలో స్వామి వారికి హారతులిస్తున్న అర్చకుడు



బండిరేవు వద్ద పూజలు అందుకున్న అంజన్న



తమలపాకులతో పూజలందుకున్న కొండపల్లి ఆలయంలోని స్వామి



ధర్మాజీగూడెంలో విశేష అలంకరణలో ఆంజనేయస్వామి

టి.నరసాపురం : హనుమద్ జయంతి సందర్భంగా మండలంలో ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, హనుమద్ చాలీసా పారాయణ, అఖండ అన్నసమారాధన నిర్వహించారు. బండిరేవు వద్ద ఆంజనేయస్వామి ఆలయంలో కొనకళ్ల మోహన్‌కుమార్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించి చాలీసా పారాయణ చేశారు. కృష్ణాపురంలో బంజారా, బజరంగిదేవి కమిటీ ఆధ్వర్యంలో జెండాలో ఉత్సవాన్ని నిర్వహించారు.

లింగపాలెం : మండలంలో హనుమజ్జయంతి వేడుకలను గ్రామగ్రామాన భక్తులు ఘనంగా జరుపుకున్నారు.ధర్మాజీగూడెం పడమర వీధి రామాలయంలో ఆంజనేయస్వామికి పూజలు నిర్వహించారు. మహిళా బృందం హనుమాన్ చాలీసా, భక్తి భజన పాటలు ఆలపించారు. కె.గోకవరంలో అభయాంజనేయ స్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. ఆయా ఆలయాల వద్ద కమిటీల ఆధ్వర్యంలో భక్తులకు అన్నసమారాధన చేశారు.

కుక్కునూరు : మండలంలో ఆదివారం హనుమాన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. కొండపల్లి హనుమాన్ ఆలయం, కొర్లకుంట సీతారామ ఆలయం, మిట్టగూడెం రామాలయాలలో ఆంజనేయస్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం సీతారాముల కల్యాణం, అన్నదానం చేశారు. సాయంత్రం స్వామి వారి విగ్రహాన్ని అయా గ్రామాలలోని వీధులలో ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయానికి ఉపాలయమైన శ్రీ అభయాంజనేయుని ఆలయంలో హనుమద్ జయంతి వేడుకలు ఆదివారం నేత్రపర్వంగా జరిగాయి. ముందుగా సిబ్బంది ఆలయాన్ని సుగంధ భరిత పుష్పమాలికలు, మామిడి తోరణాలు, అరటి బోదెలతో శోభాయమానంగా అలంకరించారు. అనంతరం అర్చకులు పూజా కార్యక్రమాలను ప్రారంభించారు. తొలుత విశ్వక్సేనపూజ, పుణ్యాహవాచనను జరిపారు. ఆ తరువాత మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, వేద మంత్రోచ్ఛరణల నడుమ ఆంజనేయునికి పంచామృత స్నపన, సహస్ర నామార్చనను నిర్వహించారు. స్వామివారికి హారతులిచ్చి, నివేదనను సమర్పించారు. అనంతరం భక్తులకు అర్చకులు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.



రెడ్డి గణపవరంలో పూజలందుకుంటున్న స్వామి

ఆర్‌బీకే, హెల్త్ క్లినిక్ ప్రారంభం



రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తెల్లం బాలరాజు

పోలవరం రూరల్ : జల్లేళ్లగూడెం పంచాయతీలో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని, హెల్త్ క్లీనిక్‌ను ఆదివారం పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రం, హెల్త్ క్లీనిక్‌ల ద్వారా సిబ్బంది అందుబాటులో ఉండి, ప్రజలకు , రైతులకు సకాలంలో సేవలు అందించాలన్నారు. ఏజెన్సీ ప్రాంతం కావడంతో మరింత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అనంతరం రెడ్డి కుంకాల గ్రామంలో నిర్వహించిన వైద్య శిబిరాన్ని ఆయన పరిశీలించారు. గ్రామాల్లో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలన్నారు. ఆ ప్రాంత వాసుల రాకపోకల దృష్ట్యా దొండపూడి నుంచి కుంకాల వరకు మెరుగైన రోడ్డు సౌకర్యం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి, జెడ్పీటీసీ కలుం హేమకుమారి, సర్పంచ్ కోటం గంగాదేవి, మండల ఉపాధ్యక్షుడు మిడియం సింగరాజు తదితరులు పాల్గొన్నారు.

భానుడి భగభగలు



నిర్మానుష్యంగా మారిన జంగారెడ్డిగూడెం పట్టణంలోని కొవ్వూరు రోడ్డు

జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూడెం పట్టణంలో భానుడు ప్రతాపం చూపించారు. ఆదివారం ఉష్ణోగ్రత 44 డిగ్రీలకు చేరుకోవడంతో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. దీంతో పట్టణంలో అప్రకటిత కర్ఫ్యూ వాతావరణం కనిపించింది. మే నెల ప్రారంభమైన తరువాత కొద్దిపాటి వాతావరణ మార్పులతో చల్లబడినా క్రమేపీ వేడి పెరుగుతూ వస్తోంది. దీనికి తోడు వడగాలులు కూడా తోడు కావడంతో వేడి వాతావరణం వాస్తవ ఉష్ణోగ్రతను మించి రెండు డిగ్రీలు ఎక్కువగా కనిపించింది. పిల్లలు, పెద్దలనే తేడా లేకుండా అందరూ ఉక్కపోతతో అల్లాడిపోయారు. పట్టణం ఉదయం 10 గంటల నుంచే నిర్మానుష్యంగా మారింది. ప్రధాన రహదారులు అన్నీ ఖాళీగా దర్శనమిచ్చాయి. ఆదివారం కావడంతో వీకెండ్‌ను సరదాగా గడుపుదామనుకున్న వారికి భానుడి ప్రతాపంతో నిరాశ కలిగింది. ప్రజలు శీతల పానీయాల వైపు మొగ్గుచూపారు. కొందరు వేసవి తాపం నుంచి రక్షణ పొందేందుకు సినిమా థియేటర్‌లను సైతం ఆశ్రయించడం గమనార్హం. మరికొన్ని రోజులు ఇలానే వాతావరణం ఉండొచ్చన్న వాతావరణశాఖ హెచ్చరికలతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలను తిప్పికొట్టాలి



గ్రామ సభలో మాట్లాడుతున్న సీపీఐ మండల కన్వీనర్

కొయ్యలగూడెం : ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న కేంద్ర ప్రభుత్వ తీరును తిప్పి కొట్టాలని సీపీఐ మండల కన్వీనర్ జెమిని శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఆదివారం తిమ్మన్నకుంట గ్రామంలో సీపీఐ నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మోడీ ప్రభుత్వాన్ని గద్దె దించే వరకు సీపీఐ ఆధ్వర్యంలో పోరాటాలు కొనసాగించాలన్నారు. ఎన్నికల సమయం దగ్గర పడుతున్నందున మోదీ ప్రజా వ్యతిరేక విధానాలను సీపీఐ కార్యకర్తలు ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలన్నారు. నరేంద్ర మోదీ అధికారం చేపట్టిన నాటినుంచి నిత్యావసర ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో సామాన్య మానవుడు బతకాలంటే కష్టతరంగా ఉందన్నారు. ప్రభుత్వ ఆస్తులన్నీ ప్రైవేటుపరం చేస్తున్నారని, అంబానీ, అదాని వంటి కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తున్న నరేంద్ర మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించాలన్నారు. కార్యక్రమంలో మద్దాల దుర్గారావు, వేల్పుల సుబ్బలక్ష్మి, చొక్కా బాలస్వామి, ధగని వెంకటేశ్వరరావు, ఆలీసమ్మ, వెంకటేశు, పెద్దులు, అంకాలయ్య, తదితరులు పాల్గొన్నారు.

దుండగులపై చర్యలు తీసుకోవాలి



అక్కమ్మ కోనేరు చెరువును పరిశీలిస్తున్న కాకినాడ రామారావు

జంగారెడ్డిగూడెం : అక్కమ్మ కోనేరులో విషప్రయోగానికి పాల్పడిన దుండగులపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర రజక సంఘం నాయకులు కాకినాడ రామారావు అన్నారు. జంగారెడ్డిగూడెంలో శనివారం అక్కమ్మ కోనేరు చెరువులో విషప్రయోగం కారణంగా చేపలు మృతి చెంది రజకులు నష్టపోయిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆదివారం రామారావు చెరువును పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దోషులను శిక్షించడంతో పాటు రజకులను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. నష్టపరిహారం అందించడంతో పాటు చెరువులోని నీటిని తొలగించి, పూడిక తీయించాలన్నారు. కార్యక్రమంలో రజక సంఘం నాయకులు తూటికుంట దుర్గారావు, అధ్యక్షుడు వడిగళ్ల శ్రీనివాస్, కౌన్సిలర్ తెలగారపు జ్యోతి, పాలూరి శ్రీనివాస్, తూటికుంట రాము, పొన్నాడ సత్యనారాయణ, మందపల్లి వెంకటరామయ్య, ఎస్.శ్రీనివాస్, వేములపూడి నాగరాజు, మందపల్లి గంగరాజు, హనుమంతు, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలతో జనసైనికుల్లో నైరాశ్యం

కొయ్యలగూడెం : ముఖ్యమంత్రి పదవి తన లక్ష్యం కాదని జనసేనాని పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలతో ఆ పార్టీ శ్రేణులే తీవ్ర నైరాశ్యంలో మునిగిపోయారని జగనన్న సచివాలయాల మండల కోఆర్డినేటర్ నూకల రాము పేర్కొన్నారు. కన్నాపురం ఫంక్షన్ హాలులో ఆదివారం సాయంత్రం వివిధ సచివాలయాల కన్వీనర్లు, ప్రజాప్రతినిధులు గ్రామ పార్టీల నాయకులతో కలసి నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏనాడు సొంత బలంతో ముఖ్యమంత్రి కాలేకపోయిన చంద్రబాబు దత్తపుత్రుడిని అడ్డం పెట్టుకొని ముఖ్యమంత్రి పదవి పొందాలని చూడడం హాస్యాస్పదమని అన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండోసారి ముఖ్యమంత్రి కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉప్పల కృష్ణ, యడ్లపల్లి సురేష్, ఎండి షాబాజ్, డాక్టర్ శ్రీను, కాటుబోయిన సురేష్, విల్లూరి మాధవరావు, సొంగా రాకేష్, మారిశెట్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



2000-01 నాటి టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థులు

చింతలపూడి : చింతలపూడి మండలం ప్రగడవరం మహాత్మాగాంధీ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల 2000-01 బ్యాచ్ పదవ తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం పాఠశాల ప్రాగణంలో నిర్వహించారు. పాఠశాలలో చదివిన రోజులను గుర్తుకుతెచ్చుకుని పాత మధుర జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని ఆత్మీయంగా పలకరించుకున్నారు. పూర్వ విద్యార్థులంతా సాయంత్రం వరకు ఆటపాటలతో ఆనందంగా గడిపారు. అప్పటి గురువులు విశ్వసుందరం, సత్యనారాయణ డ్రిల్ మాస్టారు సుబ్బారావు, సాయిబాబ, ప్రసాద్ హాజరయ్యారు. అలనాటి జ్ఞాపకాలను చెప్పుకుంటూ సహపంక్తి భోజనాలు చేశారు. పాఠశాల అభివృద్ధికి సహకారం అందించాలని తీర్మానించారు.

విద్యుదాఘాతానికి గురై వ్యక్తికి గాయాలు

జంగారెడ్డిగూడెం : విద్యుదాఘాతానికి గురై ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. ఎస్సై ఎం.సాగర్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం మైసన్నగూడెం గ్రామానికి చెందిన జుత్తిక నాగరాజు కూలి పని చేసుకుని జీవిస్తున్నాడు. ఇతనికి భార్య, ఇద్దరు సంతానం. మైసన్నగూడెం నుంచి వేగవరం గ్రామానికి వెళ్లే విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న ఆయిల్‌పామ్ చెట్లను కటింగ్ చేస్తుండగా విద్యుదాఘాతానికి గురయ్యాడు. వెంటనే లైన్‌మన్ సిబ్బందితో కలిసి జంగారెడ్డిగూడెంలోని ప్రైవేట్ ఆసుపత్రికి, అనంతరం మెరుగైన వైద్యం కోసం విజయవాడ తరలించారు. ఆసుపత్రి నుంచి నాగరాజు సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

నేడు శ్రీవారి కల్యాణం

కొయ్యలగూడెం : శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత మదన గోపాల స్వామి ఆలయంలో వేంచేసి ఉన్న శ్రీ భూదేవి శ్రీదేవి సమేత మలయప్ప స్వామి వారి కల్యాణ మహోత్సవం సోమవారం నిర్వహిస్తున్నట్లు పాలకమండలి కమిటీ చైర్మన్ మద్దు గోపి పేర్కొన్నారు. శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ప్రథమ కల్యాణ మహోత్సవం సందర్భంగా ఉదయం 6 గంటలకు అష్టోత్తర శత కలశ అభిషేకం, సాయంత్రం ఏడు గంటలకు కల్యాణం నిర్వహిస్తామని భక్తులు పాల్గొనాలని కోరారు. బ్రహ్మశ్రీ చానుమల్లి శ్రీనివాస పార్థసారథి పర్యవేక్షణలో కల్యాణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు.

ప్రథమ చికిత్సా కేంద్రానికి మందుల అందజేత



సాంబశివరావుకు స్వామివారి ప్రసాదాలను అందజేస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల : శ్రీవారి ఆలయంలోని ప్రథమ చికిత్సా కేంద్రానికి ఇద్దరు దాతలు ఆదివారం వెయ్యి మంది భక్తులకు సరిపడా మందులను విరాళంగా అందజేశారు. తెనాలికి చెందిన ఏవీ సాంబశివరావు, విజయవాడకు చెందిన జేబీ కెమికల్స్ ఆర్ఎస్ఎం కమల్ ఆలయానికి పాదయాత్రగా విచ్చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆ తరువాత ఈ మందులను ఆలయ కార్యాలయంలో ఏఈఓ పి.నటరాజారావుకు అందించారు. ఈ సందర్భంగా దాత సాంబశివరావుకు ఆయన స్వామివారి ప్రసాదాలను అందజేశారు.

కేఆర్ పురంలో మా నమ్మకం నువ్వే జగన్



కేఆర్‌పురంలో బుక్‌లెట్‌ను అందజేస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం : మండలంలోని కేఆర్‌పురంలో ఆదివారం మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ ఉయికే గొజ్జి, ఎంపీటీసీ గాలి దుర్గారావు ఆధ్వర్యంలో గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లను ఇళ్ల యజమానుల అనుమతితో ఇంటి తలుపులకు, గుమ్మాలకు అతికించారు. ప్రజల కోసం పని చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ గెలిపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు నైతిక విలువలను అలవర్చుకోవాలి



ద్వారకాతిరుమల గ్రంథాలయంలో నీతి కథల పోటీలను నిర్వహిస్తున్న గ్రంథాలయ అధికారిణి బంగారుపాప



కొయ్యలగూడెం శాఖా గ్రంథాలయంలో వివిధ అంశాలపై శిక్షణ పొందుతున్న విద్యార్థులు



లింగపాలెం శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు సూచనలు చేస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల: స్థానిక శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా విద్యార్థులకు నీతి, నిజాయితీతో కూడిన కథల పోటీలను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారిణి గుర్రం బంగారుపాప మాట్లాడుతూ ఈ కథల ద్వారా నీతి, నిజాయితీతో కూడిన నైతిక విలువలను అలవరచుకుని, ఉత్తమ పౌరులుగా ఎదగాలని విద్యార్థులకు సూచించారు. అలాగే మాతృదినోత్సవం ప్రాముఖ్యతను తెలియజేసి, ఈ లోకంలో అమ్మను మించిన దైవం లేదని, ప్రతి ఒక్కరూ అమ్మను గౌరవించాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకురాలు బట్టు మణి, భారతి, పాఠకులు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం : వేసవి విజ్ఞాన శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుంటున్నారు. శాఖ గ్రంథాలయాలలో ఏర్పాటుచేసిన వేసవి విజ్ఞాన తరగతులలో భాగంగా కొయ్యలగూడెంలోని కన్నాపురం రోడ్‌లో ఉన్న గ్రంథాలయంలో చిన్నారులు వివిధ క్రీడా, పాఠ్యాంశాలను, యోగ, జ్ఞాన, పరిజ్ఞాన రచనలు, చిత్రలేఖనం వంటి వాటిపై రిటైర్డ్ ఉపాధ్యాయుల పర్యవేక్షణలో శిక్షణ తీసుకుంటున్నారు.

లింగపాలెం : మండలంలోని ధర్మాజీగూడెం, లింగపాలెం శాఖా గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరం ఆదివారం నాటికి ఏడోవ రోజుకు చేరింది. ఈ సందర్భంగా విద్యార్థులకు నీతి కథలు, చందమామ బాలమిత్రల కథల ప్రాముఖ్యత, బొమ్మరిల్లు కథలు చదివించడం, రాయించడం చేస్తున్నారు. శ్రీబాల వెంకట సుబ్బారావు గారికి చెందిన ఎంత మేలు చేస్తే అంత మేలు కలుగుతుంది అనే కథను పిల్లలకు ఉపాధ్యాయులచే నేర్పించారు. విద్యార్థులకు చదరంగంలో శిక్షణ కార్యక్రమాన్ని ఏవీ నారాయణచే నిర్వహించారు. కార్యక్రమంలో ధర్మాజీగూడెం శాఖ గ్రంథాలయాధికారిణి వి.రమణ, లింగపాలెం శాఖ గ్రంథాలయ అధికారి ఎస్‌ఏ లతీఫ్ తదితరులు పాల్గొన్నారు.